
సాక్షి
అనంతపురం
మంగళవారం ♦ 21 ♦ మే ♦ 2024




### టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి.



### బొప్పాయి సాగు.. భలే బాగు

జిల్లాలో ఏడాదికేడాదికీ బొప్పాయి సాగు పెరుగుతోంది. లాభాలు వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.1°/22.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### తాడిపత్రిలో కొనసాగుతున్న పోలీసు బందోబస్తు



సీబీ రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

**తాడిపత్రి అర్బన్:** తాడిపత్రిలో శాంతి భద్రతలు అదుపులోకి వచ్చినా ఇంకా పోలీసు బందోబస్తు కొనసాగుతూనే ఉంది. 24 గంటలూ పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడికక్కడ తనిఖీలు, గస్తీలు నిర్వహిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పలు చోట్ల పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో పట్టణ వీధుల్లో స్థానిక పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, ఏపీఎస్పీ బలగాలు, ఏఆర్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ చేపట్టాయి. అశోక్ పిల్లర్ వద్ద ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ సమస్యాత్మక ప్రాంతాలైన బండామసీద్, చిన్న బజార్, కటికవీధి, సుంకులమ్మపాలెం, అంబేడ్కర్ సర్కిల్, గన్నెవారిపల్లి కాలనీ, యల్లనూరు రోడ్డు సర్కిల్, పుట్లూరు రోడ్డు సర్కిల్ మీదుగా అర్బన్ పోలీస్ స్టేషన్ వరకూ సాగింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయ్‌బాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు బి.శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, బీవీ శివారెడ్డి, యు.నరసింగప్ప, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తాడిపత్రి డీఎస్పీగా జనార్దన నాయుడు

**అనంతపురం/తాడిపత్రి అర్బన్:** తాడిపత్రి డీఎస్పీగా కె.జనార్దన నాయుడును నియమించారు. ఏలూరు సెబ్ డీఎస్పీగా ఉన్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే, అనంతపురం వీఆర్‌లో ఉన్న పి. నాగేంద్ర ప్రసాద్‌ను తాడిపత్రి సీఐగా నియమించారు. ఆయనతో పాటు వీఆర్‌లో ఉన్న విశ్వనాథ చౌదరిని తిరుపతి జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా, శ్రీ సత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఎం. రామారావును తిరుపతి జిల్లా అలిపిరి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లను అదుపు చేయడంలో విఫలమయ్యారన్న కారణంతో గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ గంగయ్య, అర్బన్ సీఐ మురళీ కృష్ణపై ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే.

### 23న క్యాంపస్ డ్రైవ్

**అనంతపురం ఎడ్యుకేషన్:** హోండా మోటార్ సైకిల్, స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 23న అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఐటీఐ మార్కుల మెమో, ఆధార్‌కార్డు, ఫొటోలు, పాన్‌కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, కులధ్రువీకరణ పత్రం రెండు సెట్లతో హాజరుకావాలని కోరారు. జీతం రూ. 14,074 నుంచి రూ.17,400 వరకు ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం కోలార్‌లో పని చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. 23న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ఐటీఐకు చేరుకోవాలని సూచించారు.

### 23న ఉద్యోగమేళా



**అనంతపురం:** స్థానిక ఉప్పరపల్లి రోడ్డులో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 23న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ వై.వీ. మల్లారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండు సంవత్సరాల ఉచిత టెక్నికల్ శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. పదో తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ ఫెయిల్ (ఏ ట్రేడ్ అయినా) ఉద్యోగ మేళాకు అర్హులు. 16 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న యువత పాల్గొనవచ్చు. శిక్షణ సమయంలో స్టైఫండ్ ఉంటుంది. మొదటి మూడు నెలలు రూ.7,500, తరువాత 9 నెలలు రూ.11,453, చివరి 12 నెలలు రూ.11,653 చెల్లిస్తారు. యువతీ,యువకులకు వేర్వేరు గా హాస్టల్ వసతి కల్పిస్తారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తారు. ఆసక్తి గల వారు తమ రెజ్యూమ్ లేదా బయోడేటాతో ఈ నెల 23న జాబ్‌మేళాకు హాజరు కావచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 90000 24919, 91004 77371, 77807 52418.



అనంతపురం నగరంలో కురుస్తున్న వర్షం



బుక్కరాయసముద్రం సమీపంలోని పొలంలో సేద్యం పనులు చేస్తున్న రైతులు



వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళ

## వరుణుడి హోరు.. సేద్యం జోరు

జిల్లాపై వరుణుడి కరుణ కొనసాగుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 28 మండలాల పరిధిలో 20.1 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాత్రి అనంతపురం నగరంలో వాన దంచికొట్టింది. భారీ వర్షంతో నగరవాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వారం నుంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.356 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడంతో సాగు ఖర్చులకు ఉపయోగపడుతోందని పలువురు రైతులు తెలిపారు. కాగా, జూన్ మొదటి వారంలోపే రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఖరీఫ్‌లో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదవుతుందని 'చల్లని కబురు' వినిపించారు.

– అనంతపురం అగ్రికల్చర్/
సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

# కొత్తకొత్తగా సెంట్రల్ వర్సిటీ

ఇన్నాళ్లూ శాశ్వత భవనం లేక, తగిన వసతులు లేక కునారిల్లిన సెంట్రల్ యూనివర్సిటీ ఇక వెలిగిపోనుంది. జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలకనుగుణంగా సకల హంగులతో కూడిన శాశ్వత భవనంలో ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు సాగించనుంది. వివిధ రాష్ట్రాల నుంచి వర్సిటీలో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాంపస్‌లో అన్ని వసతులు సమకూర్చారు.

**నూతన సొబగులు.. కోర్సులు**

- జంతలూరు శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తి
- ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారంభం
- అందుబాటులోకి నూతన కోర్సులు
- యూజీ స్థాయిలో నాలుగు, పీజీ స్థాయిలో 10 కొత్త ప్రోగ్రామ్‌లు



ఇటీవల జంతలూరు వద్ద సెంట్రల్ వర్సిటీ శాశ్వత క్యాంపస్‌ను సందర్శించిన భారత ప్రభుత్వ ఉన్నత విద్యా కార్యదర్శి సంజయ్‌మూర్తి

**అనంతపురం:** యూజీ స్థాయిలోనే అధునాతన కోర్సులు.. హ్యూమానిటీస్, ఆర్ట్స్, సైన్స్ సమ్మిళిత కోర్సులతో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో విద్యావిధానం.. నిష్ణాతులైన ప్రొఫెసర్లతో బోధన వెరసి అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో చేరేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని విద్యార్థులు పోటీ పడుతుంటారు. నాణ్యమైన పరిశోధనలు చేయడానికి వీలుండడంతో చాలా మంది ఇక్కడ చదవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. నిధులకు లోటు లేకపోవడం, ఎప్పటికప్పుడు బోధనా సిబ్బంది భర్తీ చేస్తుండడం సెంట్రల్ యూనివర్సిటీ ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం వర్సిటీలో 21 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాది యూజీ, పీజీ కోర్సుల్లోని 358 సీట్లకుగాను ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయంటే సెంట్రల్ వర్సిటీలో ప్రవేశం కోసం విద్యార్థులు ఎంతగా ఆసక్తి చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

**అందుబాటులోకి కొత్త కోర్సులు..**

మారిన సాంకేతికత, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం (2024–25) నుంచి యూజీ స్థాయిలో నాలుగు అధునాతన కోర్సులు సెంట్రల్ వర్సిటీలో ప్రవేశ పెట్టారు. బీకాం (ఆనర్స్), బీఏ (ఆనర్స్- ఇంగ్లిష్), బీఎస్సీ (ఆనర్స్- కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ (ఆనర్స్-సైకాలజీ) కోర్సులు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆలిండియా స్థాయి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి అడ్మిషన్లు కల్పిస్తారు.

- అలాగే, పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ (మేథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్), ఎంబీఏ, ఎంకాం, ఏంఏ (గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీ), ఎమ్మెస్సీ (క్లినికల్ సైకాలజీ), ఎమ్మెస్సీ (కంప్యూటేషనల్ సోషల్ సైన్సెస్), ఎమ్మెస్సీ (ఎకనామిక్స్ అండ్ డేటా అనాలిసిస్), ఎమ్మెస్సీ (జియాగ్రఫీ అండ్ జియో ఇన్ఫర్మేషన్), ఎమ్మెస్సీ (స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే దేశస్థాయిలో ప్రవేశ పరీక్ష కూడా నిర్వహించారు.

**నూతన జాతీయ విద్యా విధానం అమలు..**

నూతన జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం సెంట్రల్ వర్సిటీలో వివిధ కోర్సులకు సంబంధించి మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానం ప్రవేశపెట్టారు. మేజర్, మైనర్ రెండు డిగ్రీలను ఏకకాలంలో తీసుకునే అవకాశం కల్పించారు. మారుతున్న పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఈ ప్రణాళిక అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కేలా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. పీజీ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్న ఉద్దేశంతో మానవ విలువలు, పర్యావరణం, భారత రాజ్యాంగం, సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టులు బోధిస్తున్నారు.

**ఏటా పురోగతి**



పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సెంట్రల్ వర్సిటీలో కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చాం. 2024 –25 విద్యా సంవత్సరం నుంచి జంతలూరు శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహించనున్నాం. ఏటా విశేషంగా పురోగతి చెందుతూ సెంట్రల్ వర్సిటీ బలోపేతం కావడం గర్వంగా భావిస్తున్నాం.

– డాక్టర్ ఎస్ఏ కోరి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

**2018లో ఏర్పాటు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీని 2018లో ప్రారంభించారు. తాత్కాలిక పాలక భవనాన్ని జేఎన్‌టీయూ (ఏ) ఇంక్యుబేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసి, తరగతుల నిర్వహణ చేపట్టారు. పలు సౌలభ్యాల రీత్యా రెండు సంవత్సరాల క్రితం బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలకు వర్సిటీని మార్చారు. తాజాగా జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో అక్కడి నుంచి ఇకపై కార్యకలాపాలు నిర్వహించనున్నారు. జంతలూరు సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ 491.3 ఎకరాల్లో ఉండడం గమనార్హం. పాలక భవనం, తరగతి గదులను అత్యాధునిక హంగులతో నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మించారు.

### స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతపై ఎస్పీ గౌతమిశాలికి వివరిస్తూ సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ గౌతమిశాలితో కలిసి కలెక్టర్ సోమవారం సందర్శించి భద్రత చర్యలను తనిఖీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలిచ్చారు. రిటర్నింగ్ అధికారులు రోజూ ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద ప్రస్తుతం అమలవుతున్న మూడంచెల భద్రతను మరింత పటిష్టం చేశామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, వెన్నల శ్రీను, కరుణకుమారి, రాంభూపాల్‌రెడ్డి, ఏఆర్‌ఓ రమేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### 7 కేసులు..728 మంది నిందితులు

**తాడిపత్రి అర్బన్:** పోలింగ్ అనంతరం తాడిపత్రిలో జరిగిన అల్లర్లకు సంబంధించి 7 కేసులు నమోదు చేసి, 728 మంది నిందితులను చేరుస్తూ 'సిట్' డీజీపీకి నివేదిక అందించినట్లు తెలిసింది. వీరిలో 396 మందిని గుర్తించగా మిగిలిన 332 మందిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. ఇప్పటి వరకు ఘర్షణలకు సంబంధించి 91 మందిని అరెస్టు చేశారు. మరో వారం రోజులు ఈ అరెస్టులు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అల్లర్లకు సంబంధించి ప్రమేయం ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

## ఇసుక రీచ్‌లపై ప్రత్యేక నిఘా



కొర్రపాడు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**పెద్దపప్పూరు/శింగనమల:** ఇసుక రీచ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన పెద్దపప్పూరు సమీపంలోని ఇసుక రీచ్‌తో పాటు బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్ద ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. ఇసుక నాణ్యతను పరిశీలించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రీచ్‌లలో అక్రమ తవ్వకాలు, రవాణాకు తావు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగితే dmgoatpsandcomplaints @ yahoo.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైన్స్ డీడీ నాగయ్య, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, గ్రౌండ్ వాటర్ డీడీ తిప్పేస్వామి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, మైన్స్ ఏజీ ఆదినారాయణ, తహసీల్దార్ రాజశేఖర్, తదితరులున్నారు.

## ఓట్ల లెక్కింపునకు సన్నాహాలు

- కౌంటింగ్‌కు 1,061 మంది సిబ్బంది అవసరమని అంచనా
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ 14 టేబుళ్లు

| కౌంటింగ్ సిబ్బంది | అసెంబ్లీ | పార్లమెంట్ |
|---|---|---|
| సూపర్‌వైజర్లు | 210 | 175 |
| అసిస్టెంట్లు | 176 | 147 |
| సూక్ష్మ పరిశీలకులు | 192 | 161 |
| మొత్తం | 578 | 483 |

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికల పర్వంలో కీలక ఘట్టం, జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు (కౌంటింగ్)నకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. సిబ్బంది నియామకంపై దృష్టి సారించింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం (రాప్తాడు మినహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు) ఓట్ల లెక్కింపునకు 483 మంది సిబ్బంది, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 578 మంది మొత్తం 1,061 మంది అవసరం ఉంటుందని ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారు. పరిస్థితిని బట్టి ఈ సంఖ్య మరికొంత పెరగవచ్చని అధికావర్గాలు చెబుతున్నాయి.ఓట్ల లెక్కింపు రోజు ఉదయం ర్యాండమైజేషన్ అనంతరం సిబ్బందికి నియోజకవర్గాలు కేటాయిస్తారు. అదే క్రమంలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి 18 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, సర్వీసు ఓట్లు లెక్కింపునకు టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు.

**ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.**

- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 578 మంది సిబ్బంది అవసరమని నిర్ధారించారు. ఇందులో పర్యవేక్షణకు 210 మంది సూపర్‌వైజర్లు, 176 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 192 మంది సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటు చేయనున్నారు.
- పార్లమెంట్ నియోజకవర్గం (7 నియోజకవర్గాలు) ఓట్ల లెక్కింపునకు 483 మంది అవసరమని అంచనా వేశారు. ఇందులో పర్యవేక్షణకు 175 మంది సూపర్‌వైజర్లు, 147 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 161 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించనున్నారు.

**తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు**

ఓట్ల లెక్కింపు ప్రక్రియను ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభిస్తారు. అది ముగిసిన తరువాత నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు చేపడతారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపులో ఒకవైపున పార్లమెంట్, మరోవైపున అసెంబ్లీ ఓట్లను లెక్కిస్తారు. అటు తరువాత ప్రతి నియోజకవర్గంలోనూ లాటరీ పద్ధతిలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేస్తారు. ఆ ఐదింటిలోని వీవీప్యాట్‌లు లెక్కించిన తరువాతనే నియోజకవర్గాల ఓట్ల వివరాలను ప్రకటిస్తారు.

**పటిష్ట భద్రతా చర్యలు**

ఓట్ల లెక్కింపు సందర్భంగా జేఎన్‌టీయూలో పటిష్ట చర్యలు చేపట్టనున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లతో పాటు అనుమతి పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు.

## ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





సతీసమేత ప్రసన్న వేంకటరమణస్వామి మూలవిరాట్, మార్కండేయస్వామి ఆలయంలో కంకణ ధారణ దృశ్యం, చిత్రంలో బాలిక మౌనిక

- సంప్రదాయబద్ధంగా బాలికతో శ్రీవారి కంకణధారణ

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన, స్వస్తి వాచనము, రక్షా బంధనం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో సంప్రదాయబద్ధంగా కంకణ ధారణ జరిగింది. వందేళ్ల నుంచి వస్తున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా ఈ నెల 25న జరిగే శ్రీవారి కళ్యాణోత్సవానికి (పద్మశాలియ అరవ తెగకు చెందిన తొమ్మిదేళ్ల బాలికతో వివాహం) సంబంధించి శ్రీవారి నిశ్చితార్థం (కంకణధారణ) నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి తరఫున బ్రాహ్మణులు, పట్టణ ప్రముఖులు, దేవదాయశాఖ అధికారులు, బాలిక తల్లిదండ్రులు, పద్మశాలీయ కులస్తులు తాంబూలాలను ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప, కార్యదర్శి నాగప్ప, గురురాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ, శ్రీవారి సింహవాహనోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ అధికారి నరసింహారెడ్డి తెలిపారు.

## క్లుప్తంగా

### విత్తన శుద్ధి పరిశీలన



విత్తన శుద్ధి, నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

**అనంతపురం అగ్రికల్చర్:** విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియలో భాగంగా ప్రాసెసింగ్ ప్లాంట్లలో జరుగుతున్న విత్తన శుద్ధి కార్యక్రమాన్ని డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి, ఏఓ శశికళ తదితరులు సోమవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న విజయ ఆగ్రో ఏజెన్సీస్, కృష్ణ ట్రేడర్స్, హిమబిందు, నాగేశ్వర ఆగ్రోసీడ్స్, జస్వంత్ సీడ్స్ తదితర ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించారు. విత్తన శుద్ధి ప్రక్రియలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. చేస్తున్నారా? లేదా? అనేది ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అవుటన్ (షెల్లింగ్) 74 శాతం, తేమశాతం, 94 శాతం ఫిజికల్‌ప్యూరిటీ, వ్యర్థాలు 2 శాతం కన్నా అధికంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. అలాగే బస్తాల తూకం 30 కిలోలు ఉన్నాయా లేదా అనేది చూశారు. రైతులకు నాణ్యమైన విత్తనం ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, తేడా వస్తే చర్యలు ఉంటాయని డీఏఓ హెచ్చరించారు.



# బొప్పాయి సాగు .. భలే బాగు!

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే బొప్పాయి పంట సాగులో సిరులు
- జిల్లా వ్యాప్తంగా 5500 ఎకరాల్లో సాగు



వడియంపేట వద్ద సాగు చేసిన బొప్పాయి పంట

**బుక్కరాయసముద్రం:** ఏటా సంప్రదాయ పంటల సాగు చేసి దిగుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొన్న జిల్లా రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో పండ్ల తోటలు గణనీయంగా విస్తరించాయి. అయితే బొప్పాయి సాగు రైతులకు లాభాలు వర్షం కురిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 5,500 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉందని, రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో బొప్పాయికి మంచి డిమాండ్ ఉందన్నారు. బొప్పాయి సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

**సమగ్ర యాజమాన్య పద్ధతులు**

రైతులు మొదట ఆరోగ్యవంతమైన మొక్కలను ఎంపిక చేసుకోవాలి. కోవన్, 786 రెడ్‌లేడీ, కూర్గ హనేడ్యు, సోలో, పుసా మెజిస్టీ, సన్‌రూజ్ సోలో, సూర్య, అర్క ప్రభాత్, వాషింగ్టన్ వంటి రకాలు ఎంపిక చేసుకుని ఎకరాకు వెయ్యి చొప్పున మొక్కలు నాటుకోవాలి. మొక్కకు మొక్కు మధ్య 6 అడుగుల దూరం 7 అడుగుల వెడల్పు ఉండేలా చూసుకోవాలి. విత్తనాలైతే 1 సెంటీమీటరు లోతు మించకుండా విత్తుకోవాలి. భూమిని 30–40 సెంటీమీటర్ల లోతుగా దుక్కి చేసుకోవాలి. మొక్కల గుంతలలోకి పశువుల ఎరువు, వేప పిండి, వేసుకోవాలి.

**వైరస్ తెగుళ్ల యాజమాన్యం**

బొప్పాయి సాగులో వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఉంటాయి. ఆకు ముడత, రింగ్ స్పాట్ వైరస్ ప్రధానమైనవి. బొప్పాయి నారను రసం పీల్చే పురుగులు ఆశించకుండా 40X60 విస్తీర్ణంలోని నైలాన్ మెష్ నెట్ హౌస్‌లో పెంచాలి. బొప్పాయి తోట సాగు చేసే సమయంలో తోట చుట్టూ రెండు వరసలు మొక్కజొన్న, అవిశ చెట్లు రక్షణగా వేసుకోవాలి. వీటి ద్వారా రసం పీల్చే పురుగులను నివారించవచ్చు. రసం పీల్చే పురుగుల నివారణకు వేపనూనె 2.5 మిల్లీ, అసిఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రింగ్ స్పాట్ వైరస్ నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, జింక్ సల్ఫేటు 1.5 గ్రాములు, బోరాజ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. కాండం కుళ్లు తెగులు ఉన్నట్లుగా గుర్తిస్తే లీటరు నీటికి బోర్డో మిశ్రమం 1 గ్రాము, అలియేట్ 2 గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు మొదలు దగ్గర బాగా తడపాలి. బూడిద తెగులు నివారణకు లీటరు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, 1 మిల్లీ కెరాథేన్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి.

**పంట కోత, దిగుబడి**

బొప్పాయి సాగులో ఎకరాకు 1000 మొక్కలు నాటుకోవాలి. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పంట సాగు చేసిన 7 నెలల కాలం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కటింగ్ చొప్పున 5 నుంచి 8 నెలల వరకూ పంట కోత ఉంటుంది. ఆ తర్వాత కూడా ఏడాదిన్నర పాటు పంట వస్తుంది. అయితే కాయ నాణ్యత ప్రమాణం తగ్గుతుంది.ఒక ఎకరా పొలంలో బొప్పాయి సాగుకు రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో బొప్పాయి కిలో రూ.25 నుంచి రూ.28 వరకు అమ్ముడుపోతోంది. టన్నుకు రూ.25వేల నుంచి రూ.28 వేల ఆదాయం గడించవచ్చు.

**జాగ్రత్తలు తప్పని సరి**



జిల్లాలో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి తోటల్లో రైతులు బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్లపై జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకోవాలి. శాస్త్రవేత్తల సూచన మేరకు ఎరువులు తప్పని సరిగా వేయాలి. నాణ్యమైన బొప్పాయి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– డాక్టర్ మల్లేశ్వరి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

## ప్యాసింజర్ రైళ్ల సమయ పాలనపై దృష్టి సారించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌సీఆర్‌జీఎం అరుణ్‌కుమార్‌జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

**గుంతకల్లు:** ప్యాసింజర్ రైళ్ల సమయపాలనపై దృష్టి సారించాలని రన్నింగ్ సిబ్బందికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. సోమవారం జోనల్‌లోని గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల డీఆర్‌ఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్యాసింజర్, మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల భద్రత, సమయపాలనపై దిశానిర్దేశం చేశారు. రైళ్లను సురక్షితంగా నడపడం, భద్రతాకు సంబంధించిన విధివిధానాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, పర్మినెంట్ వే మెయింటెనెన్స్ సిబ్బందితోపాటు రన్నింగ్ సిబ్బందికి క్రమం తప్పకుండా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంతేకాక అధికారులు కూడ క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. ట్రాక్, సిగ్నల్ మెయింటెనెన్స్ తదితర నిర్వహణ పనులు చేపట్టే ముందు ముందుస్తు కార్యచరణను రూపొందిచాలన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని రైళ్లలో ఏసీ కోచ్‌లు సక్రమంగా పని చేసేలా చూడాలని, సాంకేతిక లోపాలను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు నుంచి డీఆర్ ఎం వినీత్‌సింగ్ పాల్గొన్నారు.

## వ్యక్తి దుర్మరణం



మల్లికార్జునాచారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ఉరవకొండ:** స్థానిక 42వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం ఉండబండ గ్రామానికి చెందిన వంట మాస్టర్ మల్లికార్జునాచారి(65) సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో పాల్తూరు క్రాస్ వద్దకు చేరుకుని 42వ జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు నుంచి బళ్లారికి వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో మల్లికార్జునాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## ఇంటర్ సప్లి పరీక్షలకు సిద్ధం

- 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఏర్పాట్లు చేస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు



పరీక్షల ఏర్పాట్లపై డీఈసీ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 24 నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 30తో ప్రధాన పరీక్షలు ముగియనుండగా, తర్వాత 31, జూన్ 1 మైనర్ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఇంటర్ పరీక్షల కన్వీనర్, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ సోమవారం సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు సిద్ధం చేశారు. ఈ నెల 22న వారితో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

**పరీక్షలు రాయనున్న 22,510 మంది విద్యార్థులు**

జిల్లాలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 22,510 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 15,921 మంది, ఒకేషనల్ విద్యార్థులు 980 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,017 మంది, ఒకేషనల్ విద్యార్థులు 592 మంది ఉన్నారు. 34 కేంద్రాలకు గాను అనంతపురం నగరంలోనే 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలుంటాయి. పరీక్ష సమయంలో నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. విద్యార్థులు అర గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**అందుబాటులో హాల్‌టికెట్లు**

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్లకు పంపారు. విద్యార్థులు నేరుగా ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాల్‌టికెట్లను అందుకోవచ్చు. అలాగే మంగళవారం నుంచి https://apbiercres.osdes.in వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. విద్యార్థులు నేరుగా ఈ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం చేయాల్సిన అవసరం లేదన్నారు.

**పరీక్షల షెడ్యూలు ఇలా...**

| తేదీ | మొదటి సంవత్సరం | ద్వితీయ సంవత్సరం |
|---|---|---|
| 24 | సెకండ్ లాంగ్వేజ్ | సెకండ్ లాంగ్వేజ్ |
| 25 | ఇంగ్లిష్ | ఇంగ్లిష్ |
| 27 | గణితం1ఏ/బొటనీ/సివిక్స్ | గణితం2ఏ/బొటనీ/సివిక్స్ |
| 28 | గణితం1బీ/జువాలజీ/హిస్టరీ | గణితం2బీ/జువాలజీ/హిస్టరీ |
| 29 | ఫిజిక్స్/ఎకనామిక్స్ | ఫిజిక్స్/ఎకనామిక్స్ |
| 30 | కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ/ఫైన్‌ఆర్ట్స్/మ్యూజిక్ | కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ/ఫైన్‌ఆర్ట్స్/మ్యూజిక్ |

## పేకాటరాయుళ్ల అరెస్ట్



కంబదూరులో జూదరుల అరెస్ట్ చూపుతున్న దృశ్యం

**కంబదూరు/బత్తలపల్లి:** ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు మండలాల్లో సోమవారం చేపట్టిన తనిఖీల్లో పలువురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వివరాలు... అందిన ముందస్తు సమాచారంతో కంబదూరు మండలం మర్రిమాకులపల్లి శివారులో ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది సోమవారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 12 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.55,150 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి సమీపంలో వ్యవసాయ తోటలో పేకాట ఆడుతూ నలుగురు పట్టుబడినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వీరి నుంచి రూ.20,150 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

**విడపనకల్లు:** మండలంలోని పెద్ద కొట్టాలపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో త్రుటిలో ప్రాణాపాయం నుంచి ఐదుగురు బయటపడ్డారు. వివరాలు... కర్ణాటక ప్రాంతానికి చెందిన ఐదుగురు తిరుమల దర్శనం చేసుకుని స్వగ్రామానికి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దకొట్టాలపల్లి సమీపంలోకి చేరుకోగానే అప్పటికే 42వ జాతీయ రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారు ఢీకొని అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తలరించారు. ప్రథమ చికిత్స అనంతరం వారు స్వగ్రామానికి తిరిగి వెళ్లారు.

## వివాహిత బలవన్మరణం

**కళ్యాణదుర్గం రూరల్:** కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన ఈరన్న, చిత్రక్క (35) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వారు. ఈ క్రమంలో ఈరన్న మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేసి కుటుంబపోషణపై దృష్టి సారించాలని పలుమార్లు చిత్రక్క వేడుకుంది. అయినా ఈరన్న తాగుడు మానలేదు. ఇదే అంశంపై సోమవారం ఉదయం దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటిపై కప్పుకు చిత్రక్క ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## రైలు ఢీకొని మార్నింగ్ వాకర్ మృతి

**తాడిపత్రి:** ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ మార్నింగ్ వాకర్ మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు... తాడిపత్రికి చెందిన రంగయ్య (30) రోజూ ఉదయం పూట వాకింగ్ కోసం తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లేవాడు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయన రెండు, ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంల మధ్య పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంగయ్యను రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య నాగమణి, కుమారుడు దేవాన్స్ ఉన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

- వేపరాళ్ల రీచ్‌లో తవ్వకాలు చేపట్టరాదు
- ఆర్డీఓ రాణిసుష్మిత



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాణిసుష్మిత

**రాయదుర్గం:** ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత, సెబ్ డీఎస్పీ శ్రీరాం, మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ అధికారులతో కలసి రాయదుర్గం మండలం వేపరాళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఇసుక తరలింపుల వల్ల స్థానికంగా ఎదురయ్యే సమస్యలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం విలేకరులతో ఆర్డీఓ రాణిసుష్మిత మాట్లాడారు. వేపరాళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వాస్తవ పరిస్థితులపై క్షుణ్ణంగా అధ్యాయనం చేసిన అనంతరం తవ్వకాలను నిషేధించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఇసుక రీచ్‌లను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ స్థానికంగా ఎదురయ్యే సమస్యలను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి రికార్డులు తప్పని సరిగా నిర్వహించాలన్నారు. వేదావతి హగరి నుంచి రోజూ 30 నుంచి 40 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా పట్టణానికి తరలించి సొమ్ము చేసుకుంటున్న అంశాన్ని విలేకరులు లేవనెత్తడంతో ప్రత్యేక నిఘా ఉంచి ఇసుక అక్రమ తరలింపులు అడ్డుకోవాలని సెబ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, సెబ్ సీఐ మురళీమోహన్, అర్బన్ సీఐ శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరుమాకులపల్లిలో కర్ణాటక పోలీసుల తనిఖీలు

- 30 ద్విచక్ర వాహనాల స్వాధీనం

**హిందూపురం అర్బన్:** చిలమత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరుమాకులపల్లిలో సోమవారం సాయంత్రం కర్ణాటక పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతంలో చోరీలకు పాల్పడుతున్న ముఠా ఇచ్చిన సమాచారం మేరకు చిక్కబళ్లాపురం డీఎస్పీ, సిబ్బంది ఆరుమాకులపల్లి చేరుకున్నారు. నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో దాచిన 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను ప్రత్యేకంగా క్యాంటర్‌లో చిక్కబళ్లాపురానికి తరలించారు. కర్ణాటక ప్రాంతంలో చోరీ చేసిన వాహనాలను తీసుకొచ్చి నాగభూషణం వద్ద డంప్ చేసి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారుగా గుర్తించారు. అలాగే చిలమత్తూరు మండలంలోని మరో రెండు గ్రామాల్లో 40 వాహనాలు రికవరీ కావాల్సి ఉందని కర్ణాటక పోలీసులు తెలిపారు.



## అడుగడుగునా రాయల వైభవం



అతి పురాతన మాధవరాయుని ఆలయం


**రాయదుర్గంటౌన్:** రాయలేలిన రాయదుర్గంలోని పలు ఆలయాల్లో అడుగడుగునా శిల్పకళా సంపద ఉట్టిపడుతోంది. పూర్వం రాయదుర్గం ప్రాంతాన్ని మహామంత్రి తిమ్మరుసు తమ్ముడు గోవిందామాత్యుడు పాలించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. అయినా నాటి మధుర జ్ఞాపకాలు మాత్రం ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రసన్న వేంకటరమణస్వామి, జంబుకేశ్వరస్వామి, దశభుజ గణపతి, లక్ష్మీనరసింహస్వామి, కోదండరామస్వామి, మాధవరాయస్వామి, రసిసిద్ధేశ్వరస్వామి ఆలయాలతోపాటు ఇతర కట్టడాలు చూడమనోహరంగా ఉన్నాయి. అరుదైన పాదరస శివలింగం, లక్ష్మమ్మ సమాధిని కూడా ఇక్కడ చూడవచ్చు.



కొండపై వెలసిన కోదండ రామస్వామి ఆలయం



ఆహ్లాదాన్ని పంచుతున్న కొండ ప్రాంతం



రససిద్దుల కొండపై వెలసిన రససిద్దేశ్వరస్వామి ఆలయం

## క్లుప్తంగా

### వేరుశనగకు 463 మంది రిజిస్ట్రేషన్



ఆత్మకూరులో వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ సుచరిత

**ఆత్మకూరు:** ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు విత్తన వేరుశనగను అందించేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. సోమవారం మండల వ్యాప్తంగా 463 మంది రైతులు, 414 క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విత్తనాలు కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు.

### కల్తీ, నాసిరకం అమ్మకాలపై నిఘా

**అనంతపురం అగ్రికల్చర్:** త్వరలో ఖరీఫ్ ప్రారంభమవుతుండటం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు సాగుకు సన్నమవుతున్నందున విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కల్తీ, నాసిరకం అమ్మకాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి హెచ్చరించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాసిరకం, కల్తీ, నిషేధిత ఇన్‌పుట్స్ అమ్మకాలపై నిఘా పెంచామన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు దుకాణాల్లో అందుబాటులో పెట్టుకోవాలని తెలిపారు. ఎంఆర్‌పీకి మించి అమ్మకూడదని, రైతులకు ఒరిజినల్ బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ధరల పట్టికను విధిగా డిస్‌ప్లే చేయాలన్నారు. స్టాక్, సేల్స్ రిజిష్టర్ల నిర్వహణ ఉండాలన్నారు. గడువు మీరినవి, నిషేధిత ఉత్పత్తులు అంటగట్టినా, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### హరితకు 'నాట్యమయూరి' అవార్డు

**అనంతపురం కల్చరల్:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదిలీలా ఫౌండేషన్ వారు ఏపీ భవన్ వేదికగా గత మూడు రోజులుగా జాతీయ స్థాయి కూచిపూడి నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన నాట్యకళాకారులు అద్భుతమైన ప్రదర్శనలతో అలరించారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన అరవింద నృత్యశిక్షణాలయానికి చెందిన కళాకారిణి హరిత రామశబ్దం కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి అక్కడి వారిని మంత్రముగ్ధులను చేసింది. ప్రతిభ కనబరిచిన హరిత నిర్వాహకులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన అధికారులు, ప్రసిద్ధ కళాకారుల చేతుల మీదుగా నాట్యమయూరి జాతీయ పురస్కారం అందుకుంది.

### పరామర్శ



లింగారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**ఆత్మకూరు:** మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగారెడ్డి (45) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, మాజీ జెడ్పీటీసీ మధు నివాళులర్పించారు.

### పొలంలో మోటార్ చోరీ

**గుత్తి రూరల్:** మండలంలోని అనగానదొడ్డి గ్రామ శివారులో ఉన్న పొలంలో మోటార్ చోరీకి గురైందని సోమవారం బాధిత రైతు హరినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. గ్రామానికి చెందిన హరినాథ్ రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేశాడు. గ్రామ శివారులో ప్రవహించే పుల్లేటి వాగులో మోటార్ ఏర్పాటు చేసి పైపుల ద్వారా రోజూ పంటకు నీరు అందించేవాడు. అయితే ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్, స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గమనించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా అనగానదొడ్డి గ్రామంలో ఆరుగురు రైతుల మోటార్లు, స్టార్టర్ బాక్సులు చోరీ చేశారన్నాడు. అలాగే పి.ఎర్రగుడి గ్రామంలో నాలుగు, పెద్దొడ్డి గ్రామంలో ఒక మోటారు, స్టార్టర్ బాక్సులు చోరీ చేశారన్నాడు. మోటార్లు, స్టార్టర్లు చోరీ చేయడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, చోరీలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



వర్షంలోనే తడుస్తూ వెళ్తున్న మహిళలు



సప్తగిరి సర్కిల్ వద్ద నిలిచిన నీటిలోనే వెళ్తున్న వాహనదారులు



నగరంలో కురుస్తున్న వర్షం



ఓ పక్కకు ఒరిగిన హైమాస్ట్ లైట్



నగరంలో ఈదురు గాలులకు కూలిపోయిన చెట్టు

## నగరంలో జోరువాన

నగరంలో సోమవారం రాత్రి భీకర వర్షం కురిసింది. ఈదూరు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో నగరం తడిసిపోయింది. ఏళ్ల నాటి చెట్లు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నగరంలోని విద్యుత్ నగర్, హౌసింగ్ బోర్డు, ఆదర్శ నగర్, ఖాజా నగర్, వేణుగోపాల్ నగర్, ఎర్రనేల కొట్టాలు, 2, 3, 4, 5, 6 రోడ్లు, ఆజాద్‌నగర్, వడ్డేవారి కాలనీ, గౌరవ గార్డెన్, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించింది. రాత్రి 8 గంటల నుంచి వర్షం కురవడంతో రాకపోకలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. ప్రధాన రోడ్లలోనే వర్షం నీరు నిలిచింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు.

– అనంతపురం కార్పొరేషన్/అనంతపురం సాక్షిఫొటోగ్రాఫర్:



### వంకల్లో పూడికతీత పనులు చేపట్టాలి



కమిషనర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**అనంతపురం కార్పొరేషన్:** మరువవంక, నడిమి వంకతో పాటు పెద్ద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం వరదలు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. వర్షాలు వచ్చే ముందు ముందస్తుగా పూడికతీత పనులు చేపడితే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఉండదన్నారు. పాత కృష్ణా థియేటర్, కేర్‌అండ్ క్యూర్ హాస్పిటల్, రిషితా పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న వంకల్లో పూడికను తీసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్‌ను కలసిన వారిలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, మసూద్, జీవ, వెంకటేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా



బాలురకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న అంజుమన్ కమిటీ పెద్దలు

**గుంతకల్లుటౌన్:** స్థానిక అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మొదటి విడతగా 18 మంది పేద ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా (సున్తీ) చేయించారు. సోమవారం అంజుమన్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది బాలురకు సున్తీ చేశారు. అనంతరం బాలురకు నెలరోజుల పాటు సరిపడ పౌష్టికాహారం కిట్లు, మందులను కమిటీ సభ్యులు ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరానికి హాజరైన పిల్లలు, వారి తల్లిదండ్రులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రభుత్వ అడిషనల్ ఖాజీ సత్తార్‌సాబ్, డాక్టర్ ఫిరోజ్ అహమ్మద్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌరవాధ్యక్షుడు టీఎస్.అబ్దుల్ రహిమాన్, సభ్యులు హాజీ అక్బర్‌సాబ్, ఆర్‌డీజీ బాషా, అఫ్రోజ్‌ఖాన్, వలిబాష, షాషావలి, అష్రఫ్, హుసేన్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు. త్వరలో రెండో విడత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తామని జాఫర్ తెలిపారు.

# హజ్‌యాత్ర పవిత్రమైనది



హజ్‌యాత్రను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

**అనంతపురం కల్చరల్:** ఇస్లాం సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనది హజ్‌యాత్ర. అనంత వాసులు చేస్తున్న హజ్‌యాత్ర శుభప్రదంగా సాగాలని మేయర్ మహ్మద్ వసీం ఆకాంక్షించారు. సోమవారం స్థానిక పీటీసీ సమీపంలోని చాందినీ మసీదు వద్ద నుంచి బెంగళూరు మీదుగా మక్కాయాత్రకు వెళ్తున్న వారిని అభినందించారు. మేయర్ వసీంతో పాటూ పార్టీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్ తదితరులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హజ్‌యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో హజ్‌యాత్ర ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. హజ్‌యాత్ర ద్వారా మక్కా, మదీనా దర్శనం ఎంతో పుణ్యకార్యమని అటువంటి అవకాశం కల్పించిన భగవంతుడికి కృతజ్ఞతగా ఉండాలన్నారు. అంతకు ముందు వారి యాత్ర జయప్రదం కావాలని ప్రత్యేక దువా నిర్వహించారు. ప్రతి ఒక్కరిని ఆలింగనం చేసుకుని ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లి మహ్మద్ రఫీ, మునీర్ సాహెబ్, మౌలానా హారూన్ రషీద్, షేక్షావలి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి షేక్‌ఖాజా, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కమల్‌భూషణ్, నాయకులు సాధిఖ్, మసూద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరీక్షించాల్సిందే..!

- ఇష్టారాజ్యంగా ఆర్‌ఎంఓల విధులు
- సంతకాల కోసం రోగులు, సహాయకులను
- ఇబ్బందులు పెడుతున్న వైనం



ఆర్‌ఎంఓ కార్యాలయం ముందు వేచి ఉన్న రోగులు

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల బాధ్యతరాహిత్యం రోగుల ఓపికను పరీక్షిస్తోంది. సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఖరీదైన మందులు తీసుకెళ్లడానికి ఆర్‌ఎంఓల సంతకాలు తప్పనిసరి. సోమవారం పదుల సంఖ్యలో రోగులు, వారి సహాయకులు ఆర్‌ఎంఓ కార్యాలయం చుట్టూ గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు, వారి సహాయకులు సంతకాల కోసం మొదటి ఫ్లోర్‌లోనే ఆర్‌ఎంఓ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. కానీ అక్కడ వారు సమయపాలన పాటించడం లేదు. ఒక వేళ ఉన్నా.. కాసేపు ఉండాలని సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పి రోగులను వేచి ఉండేలా చూస్తున్నారు. దీంతో రోగులు, వారి సహాయకులు సంతకాల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఎక్కడైనా రోగికి సంబంధించి సేవలు జాప్యం ఉండకకూడదని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయినా ఆర్‌ఎంఓల పనితీరులో ఎటువంటి మార్పు రావడం లేదు. అవసరమైన వాటికి స్పందించకుండా.. రోగులకు ఇబ్బందులను ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన పనులపై దృష్టిసారించడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సూపరింటెండెంట్ వీరి పనితీరుపై దృష్టిపెడుతారో లేదో వేచి చూడాలి.

### 74.8 మి.మీ. వర్షపాతం నమోదు

**కనగానపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కనగానపల్లితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో 74.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు నీటితో నిండిపోయాయి. అలాగే పలుచోట్ల వాగులు పొంగిపొర్లాయి. చాలా రోజుల తర్వాత మండలంలో మంచి వర్షం కురవడంతో ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

# లిఫ్ట్‌కు మోక్షమెప్పుడో ?



లిఫ్ట్ పని చేయడం లేదని పోస్టర్ అతికించిన దృశ్యం



చిన్నారిని ఎత్తుకుని వార్డుకు వెళ్తున్న ఓ తల్లి

- తల్లులు, సిబ్బంది అవస్థలు
- నిద్రమత్తులో ఇంజినీర్లు

**అనంతపురం మెడికల్:** ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. ఆస్పత్రిలోని పాత ఓపీ బ్లాక్ ముందున్న లిఫ్ట్ గత కొన్ని వారాలుగా పని చేయడం లేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ఆస్పత్రిలో రెండో అంతస్తులో చిన్నపిల్లల వార్డు ఉంది. వార్డులో అడ్మిషన్ చేయించుకునేందుకు వెళ్లే వారు పదుల సంఖ్యలో గస పోసుకుంటూ మెట్లు ఎక్కాల్సి వస్తోంది. చిన్నారుల నుంచి పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. పొరపాటున కిందకు పడ్డా తీవ్ర గాయాలపాలయ్యే అవకాశం లేకపోలేదు. ఆర్థో వార్డులో లిఫ్ట్ ఉన్నా.. అటువైపుకు వెళ్లలేని పరిస్థితి. దీంతో పాటుగా ఆస్పత్రికి వచ్చే కొందరు సిబ్బంది మెట్లు ఎక్కలేని పరిస్థితి. గతంలో వారికి మోకాళ్ల శస్త్రచికిత్సలతో పాటు తదితర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వీరు మెట్లు ఎక్కి వెళ్లలేక పోతున్నారు. అత్యంత కీలకమైన పనులను చేయించడంలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న సంబంధిత అధికారి కార్యాలయంలోనే ఇంజినీర్లు తిష్ట వేస్తున్నారు. ఆస్పత్రి నుంచి వారికి సమాచారం వెళ్లినా.. ఆలస్యంగా స్పందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రిలో జరుగుతున్న పరిస్థితులపై పరిశీలిస్తే రోగులకు సగం ఇబ్బందులు తలెత్తవు.

# నేపాల్‌లో అనంత నృత్యాభినయం



నృత్యం చేస్తున్న కళాకారిణి



పురస్కారాలు అందుకున్న అనంత కళాకారులు

- విదేశాల్లోనూ ఆకట్టుకున్న జిల్లా కళాకారులు

**అనంతపురం కల్చరల్:** విదేశాల్లోనూ అనంత నాట్య కళాకారులు జిల్లా ఖ్యాతిని చాటుతున్నారు. తమ దైన అభినయంతో అక్కడి వారిని అలరించారు. ఇండో నేపాల్ కల్చరల్ అవార్డ్స్ ఫెస్టివల్‌లో జిల్లాకు చెందిన నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఆమె శిష్య బృందం వివిధ నాట్యరీతులతో మెప్పించారు. కాట్మండులోని నేపాల్ టూరిజం బోర్డు ఆడిటోరియంలో కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ వారి సౌజన్యంతో సాగిన పురస్కార ప్రదానోత్సవంలో శ్రీనృత్య కళానిలయం చిన్నారులు దీప్తి, మేఘన, శ్రీనిధి నాట్య పురస్కారాలు అందుకున్నారు. నాట్య గురువు సంధ్యామూర్తిని నిర్వాహకులు శ్యాంప్రసాద్ కొడిగి, అనిత కొడిగి, ముఖ్య అతిథులుగా విచ్చేసిన నేపాల్ కళాస్రష్టలు బసంత్ శ్రేష్ఠ, మదన్మోహన్ శ్రేష్ఠ, నారాయణి దేవి సత్కరించారు. అలాగే ఉత్తమ గురు పురస్కారం అందించారు.

# నమో నారసింహా..

- నేడు లక్ష్మీ నరసింహస్వామి జయంతి
- కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయాలు



అలంకరణలో లక్ష్మీ నారసింహుడు

**అనంతపురం కల్చరల్:** రాష్ట్రంలోనే నరసింహ స్వామి దేవాలయాలకు అనంత జిల్లా ప్రసిద్ధి చెందిందని పురాణ నేపథ్యం ఉంది. అందులో భాగంగానే కదిరి, పెన్నహోబిలం, సోమగట్ట, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో స్వామి విశేష పూజలందుకుంటున్నట్లే నగరంలోనూ నరసింహస్వామి కొలువుదీరి భక్తుల కొంగు బంగారంగా భక్తి నీరాజనాలందుకుంటున్నాడు. నగరం ఏర్పడిన తొలి రోజుల్లో పాతూరులో నిర్మాణమైన ఈ ఆలయంలో నరసింహ స్వామి జయంతి కన్నుల పండువగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. అలాగే రుద్రంపేట, కళ్యాణదుర్గం బైపాసు వద్ద ఉన్న నరసింహ స్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

**ఆలయ చరిత్ర ఘనం**

నగరం ఏర్పడుతున్న రోజుల్లో శివకేశవ ఆలయాలను ఆనాటి రాజులు పోటీ పడి నిర్మించారు. అయితే చాలా ఏళ్ల వరకు అన్ని దేవతామూర్తులకు ఆలయాలున్నా నరసింహస్వామి కంటూ ప్రత్యేక ఆలయమంటూ ఉండేది కాదు. పాతూరు వీధుల్లో కొలువైన చిన్నాంజనేయ స్వామి గుడి (ప్రస్తుతం వ్యాసరాజ మఠం)లోనే చిత్రపటం పెట్టుకుని పూజలు జరిపించేవారు. వందల సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ ఆలయాన్ని 1,998లో ఎండోమెంట్ వారి సహకారం, వివిధ మతాల సహకారం, భక్తుల కమిటీలతో ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహ ప్రతిష్టలు జరిగాయి. ఇదే సుందర ప్రాంగణంలో ప్రహ్లాద ప్రతిరూపమైన ఆంజనేయస్వామితో పాటూ రాఘవేంద్ర స్వామి బృందావనం, వేణుగోపాల స్వామి, వ్యాసరాయలు, మహేశ్వరుడు, నవగ్రహాలు నిత్యపూజలందుకుంటున్నాయి. ముఖ్యంగా నరసింహస్వామి వెలసిన తర్వాత ప్రతి ఏటా నరసింహస్వామి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది.

### నేడు ప్రత్యేక పూజా కార్యక్రమాలు..

నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామికి అభిషేక, అలంకార సేవలు, మన్యుసూక్త హోమం శాస్త్రోక్తంగా జరుగనున్నాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవ వేడుకలు జరుగనున్నాయి. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రతినిధులు నాగరాజు, రఘునాథా చార్ కోరారు.

### సోమనాథ్‌కు 'నాట్యరత్న జాతీయ అవార్డు'



సోమనాథ భరద్వాజ్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** నగరానికి చెందిన యువకళాకారుడు సోమనాథ భరద్వాజ్ మరోసారి జాతీయ వేదికలపై మెరిశాడు. తాడేపల్లిగూడెంలో గత మూడు రోజులుగా బీవీఆర్ కళాకేంద్రం వారు నాటక పోటీలు, నాట్యపోటీలు నిర్వహించారు. అందులో భాగంగా చివరి రోజు నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యుడు సోమనాథ భరద్వాజ్ సత్తా చాటాడు. జాతీయ స్థాయి నాట్యరత్న పురస్కారం, నగదు బహుమతి అందుకున్నాడు. వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ రమణారావు తదితరులు కూచిపూడి నాట్య ప్రచారానికి సోమనాథ్ భరద్వాజ్ చేస్తున్న కృషిని అభినందించారు.



**ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమేమనగా మా క్లైంటుదారులు అయిన రేనాటి మునిలక్ష్మి భర్త : ఆర్. నాగేంద్ర రెడ్డి,నివాసం : డోర్ నెం. 5/110-ఎ, పాపంపల్లి గ్రామం, ఆత్మకూరు మం॥ గార్లకు హక్కు అనుభవం గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం. 873/1981, తేది : 11-02-1981 ఇంగువ నాగలక్ష్మి భర్త దేవరకుండ సత్యనారాయణ, హిందూపురం గార్ల పేరుతో వున్న ఒరిజినల్ లింకు పత్రం అనంతపురము రిజిష్టరు ఆఫీసు రామనగర్ నందు పోగొట్టుకున్నామని ఈ విషయము అనంతపురము 4వ పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసి వారి నుంచి ఒక సర్టిఫికేట్ పొందివున్నామని కావున తమ వద్ద ఒరిజినల్ లింకు పత్రములు నకలు మాత్రమే వున్నవని తెలిపియున్నారు. కావున ఎవరికైన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి సదరి పత్రం గురించి గానీ ఆక్షేపణలున్నచో ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోపల మాకు తెలుపుకోరుచున్నాము.

**షెడ్యూలు**

అనంతపురము రి॥డి॥ అనంతపురం సబ్॥డి॥కి చేరిన పాపంపేట గ్రామ పొలంలో ఎ. నారాయణపురం పంచాయితీ ఏరియాలోని ఆస్తి వివరం.

| బాబు వివరం సర్వే నెం. | ఎ.సి. |
|---|---|
| సర్కారు ఖుష్కి 49 | 8.48 |
| సర్కారు ఖుష్కి 50 | 10.06 |
| | 18.54 సెంట్లు |

ఎ.సి. 0.05 1/2, హెచ్.యస్. : 0.022, ప్లాటు నెం. 112, యల్.పి. నెం.109/75, చెక్కుబంది : తూర్పు : 40 అ॥ రోడ్డు; దక్షిణం : ప్లాట్ నెం.118; పడమర : ప్లాటు నెం.111; ఉత్తరం : 33 అ॥ రోడ్డు; కొలతలు : తూర్పు-పడమర : 40 అ॥ లేక 12.19 మీటర్లు ; ఉత్తరం-దక్షిణం : 60 అ॥ లేక 18.24 మీటర్లు.

డి. హనుమంతరెడ్డి, అడ్వకేట్
అనంతపురము, Cell : 7396685911